


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 321 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 23 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :321 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 23 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

## పిల్లలే మన ఆస్తి అన్న నారా లోకేశ్

- రాష్ట్ర వ్యాప్తంగా 42.70 లక్షల మంది తల్లులకు లబ్ధి
- రూ. 10,120.78 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం
- పిల్లల చదువులు కుటుంబానికి తరగని ఆస్తి అన్న లోకేశ్

- మిగతా 2లో




# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా



పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు.మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు

- మిగతా 2లో



# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

## కుమారుడి ప్రమాద కేసులో కుట్ర ఆరోపణలు

- శ్రీకాకుళంలోని నివాసం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఇంటి వద్ద వైకాపా కార్యకర్తలు చేరడంతో ఉద్రిక్తత
- కొడుకు చేసిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి
- కుమారుడిని కాపాడేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు
- మరో వ్యక్తిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారని అభియోగం
- బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని కేసు నమోదు

- మిగతా 2లో

## తమ్మినేని సీతారాంపై సమగ్ర

# విచారణకు ఆదేశించాం

- స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని దారుణాలకు ఒడిగట్టాడన్న అచ్చెన్నాయుడు
- బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్టు చిత్రీకరించారని మండిపాటు
- తప్పు చేసిన వారిని ప్రభుత్వం చట్టప్రకారం శిక్షిస్తుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..

# భారీగా అభివృద్ధి చేస్తా

- మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పేదలకు శాశ్వత పట్టాల పంపిణీ
- ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్న లోకేశ్
- మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్న మంత్రి
- రూ.1800 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కేంద్ర నిధులతో ఎంపీ పెమ్మసాని సహకారంతో అభివృద్ధి పనులు

- మిగతా 2లో



## ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు..

# దీక్ష విరమణకు సిద్ధం

- ఆమరణ నిరాహార దీక్ష విరమించేందుకు సోనమ్ వాంగ్‌చుక్ సుముఖత
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలన్న షరతు
- నీట్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలు

- మిగతా 2లో



## 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు..

# ఒక్కరికీ శిక్ష లేదు

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రధాని క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టు

- మిగతా 2లో



## పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం..

# విపక్షాలకు కేంద్రం పిలుపు



- నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చకు సిద్ధమన్న కిరణ్ రిజిజు
- చర్చతోనే విద్యార్థుల్లో విశ్వాసం పెరుగుతుందని వ్యాఖ్య
- విపక్షాలు షరతులు విధిస్తున్నాయంటే చర్చను కోరుకోవడం లేదని అర్థమని వ్యాఖ్య

- మిగతా 2లో

# అలా చేస్తే బ్రిడ్జి లేదా పవర్ ప్లాంట్‌పై దాడి చేస్తాం



## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

- హార్ముజ్ జలసంధిలో ఓడలపై దాడి చేస్తే సహించబోమన్న ట్రంప్
- ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు తప్పవని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు రవాణాలో హార్ముజ్ జలసంధి అత్యంత కీలకం

పెన్ పవర్ డెస్క్:అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హార్ముజ్ జలసంధిలో ఎలాంటి దాడులకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ అటువంటి చర్యలకు దిగితే, ఇరాన్‌లోని వంతెనలను లేదా పవర్ ప్లాంట్‌లను ధ్వంసం


- మిగతా 2లో

# తెలంగాణలో మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు..

## వాతావరణ శాఖ హెచ్చరిక

- ఉత్తర తెలంగాణలో భారీ వర్షాల అవకాశం
- హైదరాబాద్‌లో పలుచోట్ల కుండపోత వర్షం
- ప్రధాన రహదారులు జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం
- డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రజలకు ఇబ్బందులు
- జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తం
- కొనసాగుతున్న వర్షపు నీటి తొలగింపు పనులు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వానలు లేక విలవిల... కరువు కోరల్లో రెండు తెలుగు రాష్ట్రాలు

భారత వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా వర్షాలపై వాతావరణశాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. మరో మూడు, నాలుగు రోజులు చురుగ్గా నైరుతి రుతుపవనాలు కదలనున్నట్లు పేర్కొంది. ఉత్తర, తూర్పు, ఈశాన్య భారత్‌లో విస్తారంగా వానలు కురుస్తాయని చెప్పింది. పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, గుజరాత్, మహారాష్ట్రలో అతి భారీ వర్షాలు, జమ్ముకశ్మీర్, హిమాచల్, లడఖ్‌లో భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మాత్రం మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. దీంతో పంటల పెరుగుదల, దిగుబడి, చివరకు రైతుల ఆదాయం అనిశ్చితిలో పడే అవకాశం ఉంది.

**సరైన వానలు లేక...**

ఆంధ్రప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా వానలు పడుతున్నా సరిగా పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఏపీలోని అనేక ప్రాంతాలు కరవు తో అలమటించిపోతున్నాయి. నైరుతి రుతు పవనాలు, అల్పపీడనం ప్రభావం, ఉపరి తల ద్రోణి కారణంగా అక్కడక్కడా వానలు పడతాయని, అయితే భారీ వానలు మాత్రం పడవని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేసుకోవాలని, వర్షాధార పంటల జోలికి వెళ్లవద్దని సూచించారు. రాయలసీమలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే ఉత్తరాంధ్రలోనూ వానలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**తేలిక పాటి జల్లులు...**

తెలంగాణలోనూ వానలు పడటం లేదు తేలికపాటి జల్లులు మాత్రమే పడుతున్నాయి. మోస్తరు వానలు కొన్నిచోట్ల పడుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడినప్పటికీ వానలు దంచి కొట్టక పోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. ఉత్తర తెలంగాణలో వానలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు ఎండిపోయాయి. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సాగు, తాగు నీటికి ఇబ్బందిగా మారింది. ప్రధానంగా వ్యవసాయం కుదేలయి పోయింది. ఎక్కడ చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయి. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది. కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి కేంద్ర సాయాన్ని కోరనుంది. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాలు కరువుతో విలవిలలాడుతున్నాయి.

# మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు.. భారీగా అభివృద్ధి చేస్తా

మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి**

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

**ఓటమి నేర్పిన పాఠం.. ప్రజల మనసు గెలిచా**

2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల ప్రయాణం**

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని లోకేశ్ అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నేటి నుంచి నిధులు జమ చేస్తున్నామని, 4 వేల రూపాయల పింఛను, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేయడం వల్లే కేంద్రం నుంచి నిధులు సులభంగా వస్తున్నాయని, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడిపిన బైక్ ఢీకొనడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మకు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే వ్యక్తిని

కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేశారని, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, అలాగే ప్రమాదానికి సంబంధించిన బైక్‌ను మార్చి ఆధారాలను తారుమారు చేయాలని చూశారన్న అభియోగాలతో అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

వైసీపీ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూ భాగోతాలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం దారుణమన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించి సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పరువు తీసిన వారిని ధర్మాన వంటి నేతలు వెళ్లి పరామర్శించడం, జగన్ వారిని సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపులు తమ సంస్కృతి కాదని, తప్పు చేసిన ఎవరినైనా కూటమి ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించి తీరుతుందని స్పష్టం చేశారు.

గతంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన జగన్, ఇప్పుడు వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి ఉత్తుత్తి సమావేశాలు నిర్వహిస్తున్నారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలు తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడారని తెలిపారు. కేంద్ర మంత్రులు కూడా నేరుగా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. ఢిల్లీ స్థాయిలో ఈ చర్చలు ఫలవంతం కావడంతో, ఆ క్రెడిట్ ఎక్కడ చంద్రబాబుకు దక్కుతుందోనన్న భయంతోనే జగన్ సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం రైతుల ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్న దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోందని వివరిస్తూ, పిల్లల చదువు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి తల్లికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో 152 ప్రశ్నపత్రాల లీక్‌లు జరిగాయని, దీంతో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రాహుల్, ప్రశ్నపత్రాల లీక్‌లపై నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనన్నారు. వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని విమర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి, కుటుంబాలు రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా వారి భవిష్యత్తు దెబ్బతింటోందని రాహుల్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోతుండగా, ప్రత్యేక అవకాశాలు ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు.

# పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం.. విపక్షాలకు కేంద్రం పిలుపు

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించేందుకు తాము సిద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ అంశంపై సభలో పారదర్శకంగా చర్చించడం ద్వారా విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ కీలక ప్రకటన వెలువడింది. విద్యార్థుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని కిరణ్ రిజిజు ప్రకటించారు. పేపర్ లీకేజీ అంశంపై సభలో లోతైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, ఈ సందర్భంగా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వినిపించవచ్చని సూచించారు. అయితే, చర్చకు షరతులు విధించడం అంటే వారు చర్చను కోరుకోవడం లేదనే అర్థం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏ సమస్య నుంచి పారిపోదని, అన్నిటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం

చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లేదా అఖిలేష్ యాదవ్ వంటి నేతలు ఎవరైనా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని, అయితే సభా నిబంధనల ప్రకారమే చర్చ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. మరోవైపు, నీట్ పరీక్ష లీకేజీపై చర్చ జరిగే తేదీ, సమయాన్ని నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రభుత్వం కోరింది.

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

- మొదటి పేజి తరువాయి

అంతర్జాతీ య విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు..

తెలంగాణలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోయిందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం కూడా రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండి పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, కృష్ణానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతతో పలు రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

# ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు.. దీక్ష విరమణకు సిద్ధం

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తన దీక్షను విరమించేందుకు ప్రభుత్వానికి ఒక షరతు విధించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపు చర్యలు తీసుకోబోమని హామీ ఇస్తే, తాను దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని బుధవారం ప్రకటించారు. "ఈ ఉద్యమంలో పాల్గొన్న యువ నిరసనకారులపై ఎటువంటి శిక్షాత్మక లేదా ప్రతీకార చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావాలని నేను గౌరవపూర్వకంగా కోరుతున్నాను. న్యాయబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా విధానం కోసం గళమెత్తడమే వారు చేసిన ఏకైక 'నేరం" అని కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్‌లకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. నీట్ అక్రమాలపై జవాబుదారీతనం, విద్యా సంస్కరణలు కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నారు. దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇప్పటికే ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ, ఆయన తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. సీజేపీ నేతృత్వంలో జరుగుతున్న ఈ ఆందోళనల క్రమంలో పోలీసులతో ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. విద్యార్థుల సంక్షేమం, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను ప్రధాన డిమాండ్లుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే ఉద్దేశంతోనే వాంగ్‌చుక్ ఈ ప్రతిపాదన చేశారు.

# అలా చేస్తే బ్రిడ్జి లేదా పవర్ ప్లాంట్‌పై దాడి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

చేస్తామని ఆయన హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించే నౌకలను లక్ష్యంగా చేసుకుంటే, ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై బాంబుల వర్షం కురిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ జలసంధిలో నౌకలపై ఎలాంటి దాడి జరిగినా అమెరికా తీవ్రంగా స్పందిస్తుందని, ఇరాన్‌కు చెందిన కీలక ఆస్తులను లక్ష్యంగా చేసుకుని నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.

హర్మూజ్ జలసంధి ప్రాంతంలో సముద్ర భద్రత, అంతర్జాతీయ చమురు సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ నౌకాయానానికి ఆటంకం కలిగించే ఇరాన్ చర్యల పట్ల అమెరికా కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతాలను ఈ హెచ్చరిక ఇస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలు ప్రాంతీయ స్థిరత్వం, దౌత్యపరమైన ప్రయత్నాలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ముఖ్య మంత్రి చంద్రబాబును కలసిన ఎంపీ మాగుంట



**ఒంగోలు, పెన్ పవర్, జూలై 22**

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా వారిని ఎయిర్ పోర్ట్ లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.


పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# ఆ సార్ రూటే సప"రేటు"

## మండలంలో విచ్చలవిడిగా దండకాలు

- ఇసుక,మట్టి,మద్యం ఎవరిని వదిలి వైనం
- కొలుపులు,బ్రహ్మోత్సవాలు జరుపుకోవాలన్నా మామూళ్లు ఇవ్వాల్సిందే
- పెద్ద దందానే నడిపిస్తున్న ఎస్సై శ్రీకాంత్
- స్టేషన్ కు ఎవరు వచ్చినా రుసుం చెల్లించాల్సిందే
- అడిగినంత ఇవ్వకపోతే కేసులు పెడతామంటూ బెదిరింపులు
- ఎస్సై వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటానంటున్న యువకుడు
- మీడియా ముందు ఆవేదన

*కొనకనమిట్ల పోలీసులకు అవినీతి మరక అంటుకున్నది.ఎస్సై ఒక కానిస్టేబుల్ విమర్శల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వెలుగులోకి వస్తున్న ఘటనలు ఖాకీ వ్యవస్థకు మచ్చ తెస్తున్నాయి. ఆ పోలీస్ స్టేషన్ సిబ్బంది వసూళ్ల పర్వం పై ఓ వ్యక్తి చేసిన ఆరోపణ కలకలం రేపింది. దీంతో ఆరోపణలు ఉన్న ఎస్సైతోపాటు కానిస్టేబుల్ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఇసుక,మట్టి లతోపాటు దైవ కార్యక్రమాలకు కూడా మామూళ్లు వసూళ్లు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తాయి.*




### న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటా..వెంకటేశ్వర్లు..



నువ్వు అక్రమంగా ఇసుక తోలుతున్నట్టు నాకు సమాచారం వచ్చింది.పోలీస్ స్టేషన్ కు రా నీ సంగతి తెలుస్తాం.. ఇసుక తోలకపోయినా తోలినట్టు కేసు పెడతాను.లేదంటే మా సంగతి ఏంటో చూసుకో.. అంటూ ట్రాక్టర్ యజమాని అయినా నన్ను ఎస్సై శ్రీకాంత్ దౌర్జన్యం చేసినట్లు చెప్పాడు.నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ అవమానిస్తున్నాడు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, పోలీసుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

### అతని ఆరోపణలు అవాస్తవం ఎస్సై శ్రీకాంత్..



నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. నేను ఎటువంటి బెదిరింపులకు పాల్పడలేదు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తోలుతున్నాడన్న సమాచారంతో హెచ్చరించాను. దొంగ ఇసుక తోలితే కేసు నమోదు చేస్తానని చెప్పాను. నా కుటుంబ సభ్యులకు 50 వేలు ఫోన్ పే చేసినట్లు చెప్పడం దారుణం.

**మార్కాపురం/కొనకనమిట్ల పెన్ పవర్ జూలై 22**

కనిపించే మూడు సింహాలు చట్టానికి,న్యాయానికి,ధర్మానికి ప్రతీకలైతే,కనిపించని నాలుగో సింహమేరా పోలీస్..'అంటూ ఓ సినిమాలో హీరో చెప్పే ఈ డైలాగు దశాబ్దాలుగా ప్రజల మనసుల్లో నాటుకుపోయింది.సమాజరక్షణతోపాటు క్రమశిక్షణకు చిరునామాగా ఉండాల్సిన 'నాలుగో సింహం' గాడి తప్పుతుంది.ఆదర్శంగా నిలవాల్సిన పోలీసులే లంచాలకు ఎగబడుతున్నారు.ఒకరిని చూసి మరొకరు పోటీపడి మరీ వసూళ్లకు తెగబడుతున్నారు.బుధవారం కొనకనమిట్లకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఎస్సై కానిస్టేబుల్ పై పలు అవినీతి ఆరోపణలు మీడియా ముఖంగా తెలియజేశాడు.ఆయన చేసిన ఆరోపణలు మండలంలో ఆసక్తిని రేపుతున్నాయి..

**కొలుపులు నిర్వహించుకోవడానికి 50,000 ఫోన్ పే..:** ఆ గ్రామంలో సంప్రదాయకంగా ప్రతి ఏడాది కొలుపులు జరుపుకుంటారు.అయితే మా అనుమతి లేకుండా కొలుపులు జరుపుకోవాలని సాధ్యం కాదని మాకు 50,000 ఇస్తేనే జరుపుకోవడానికి అనుమతి ఇస్తామని ఎస్సై శ్రీకాంత్ హుకుం జారీ చేసినట్టు వెంకటేశ్వర్లు తెలిపారు.అడిగినంత ఇవ్వకుంటే అక్రమ కేసులు బనాయించి లోపల వేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నాడు.చేసేది ఏమీ లేక జూన్ 1వ తేదీన తన బంధువుల అకౌంట్ కి 50,000 ఫోన్ పే చేసినట్లు తెలిపాడు.మండలంలో ఏ కార్యక్రమం చేపట్టాలన్న ఆయనకు మామూలు ఇవ్వాల్సిందేనని ఆరోపించాడు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**తల్లికి వందనం ద్వారా 10 వేల కోట్లు విడుదల**

**అలగాయపాలెం హైస్కూల్లో తరగతి గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే**

**10 లక్షలతో భవనం నిర్మించిన హేచరీస్ యజమానులు**



**ఉలవపాడు పెన్ పవర్, జూలై 22**

ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం జడ్పీ హైస్కూల్ లో... సుమారు 10 లక్షల రూపాయలు ఖర్చుతో నాలుగు గదులతో కూడిన రెండంతస్తుల భవనాన్ని హేచరీస్ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్మించగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. పి 4 కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో ముందుకు వచ్చి, భవనాన్ని అన్ని వసతులతో నిర్మించిన దాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునేవారు, స్థానిక ప్రజల అవసరాలు గమనించి, ఆర్థికంగా తోడ్పాటు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా, రెండవ విడతగా ఈరోజు రాష్ట్రంలో 67.50 లక్షల మంది విద్యార్థులకు 10,120 కోట్ల రూపాయలను తల్లుల ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటిలో ఎంతమంది చదువుతుంటే, అంతమందికి 13 వేలు చొప్పున ఇస్తున్నామన్నారు. అలగాయపాలెం పాఠశాలలో ఈ ఏడాది 184 మంది విద్యార్థులకు 27.60 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు అందించామన్నారు. మధ్యాహ్న భోజనం కూడా నాణ్యతతో పెడుతున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఒక లీప్ స్కూల్ ను మోడల్ గా తీర్చిదిద్దేలా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ద్వారా పాఠశాలల్లో పెండింగ్ సమస్యలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ముందు చూపున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ అడుగుజాడల్లో నడవటం గర్వంగా ఉందని



ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ఉలవపాడు నుంచి అలాగాయపాలెం వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును విద్యార్థుల కోసం, రెండు కిలోమీటర్ల దూరంలోని అంకమ్మపాలెం వరకు పొడిగించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, కరేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆదాము, హేచరీస్ యజమానులు సుబ్బాజీ, ఏవీఎస్ రాజు, పాటిబండ్ల మాల్యాద్రి, డిప్యూటీ డిఇఓ రవీంద్ర, ఎంఈఓ లు రత్నం, రమణయ్య, హైస్కూల్ హెచ్ఎం చంద్రమౌళి, స్థానిక నాయకులు కోమట్ల వెంకట రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పెల్లేటి వెంకటరామిరెడ్డి, గుమ్మడి శ్రీనివాసులు రెడ్డి, వాయల జాలమ్మ, శ్రీను, మండల నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, బాలమురళి, చెంచురామిరెడ్డి, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువు రహిత ప్రాంతంగా దొనకొండలో తీర్చిదిద్దడమే నా లక్ష్యం

## దొనకొండ నీటి కష్టాలు తొలగించేందుకు కృషి -డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి




**దొనకొండ జులై 22 పెన్ పవర్**

మండలంలో జలధర జల హారతి కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ పి రాజబాబు సందర్శించారు. దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దోమ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగవరపు జోసఫ్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. రుద్రసముద్రంతోపాటు పలు గ్రామాలలోని చెరువులను సందర్శించారు. రుద్రసముద్రం చెరువు కూడిక కతీత పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ దొనకొండలో ఉన్న 40 చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. గుండ్లకమ్మ మిగులు జలాల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు అంచనాల రూపొందించి ప్రభుత్వానికి పంపుతున్నాను. తద్వారా ఎక్కడ డిఆర్డిఏ పరిశ్రమకు నీటిలో వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ కరువు విముక్తి నుండి దొనకొండను కాపాడి అభివృద్ధి దొనకొండ గా చూడాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తామన్నారు. అందులో భాగంగానే నీటి వసతి కల్పించి పరిశ్రమలకు అభివృద్ధి చేయడం లక్ష్యంగా మన కూటమీ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కృషితో దొనకొండలో శాశ్వతంగా త్రాగు సాగు నీటి కష్టాలు తీరే విధంగా ప్రాణాలికలు రూపొందిస్తామన్నారు. మండలంలోని భూగర్భ జలాలను పెంపొందించే దిశగా చెరువులు అభివృద్ధి చేయడం, గుండ్లకమ్మ మిగులు జలాలను లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు మళ్లించడం తద్వారా నీటి కష్టాలను తీర్చి పరిశ్రమలకు వాటర్ అందించే దిశగా అధికారులు చేస్తున్న కృషిని ఆమెను అభినందించారు. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత విముక్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని అన్ని శాఖల అధికారులు గ్రామ పార్టీ అధ్యక్షులు వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు ప్రజలు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# అడ్మిషన్లు, ఉత్తీర్ణత శాతం పెంపే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆదేశం

**మార్కాపురం పెన్ పవర్ జూలై22**

వసతి గృహాల్లో చదివే విద్యార్థుల అడ్మిషన్లు, ఉత్తీర్ణత శాతం ఎంపే లక్ష్యంగా అందరు అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో బుధవారం జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మెనుకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని నిబంధనలకు లోబడి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. దీని విషయంలో పబ్లిక్ పర్ఫెక్షన్ బాగలేదన్నారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థుల ప్రవర్తనను గమనించి వారిని మంచి నడవడిక మార్గంలోకి తేవాలన్నారు. వసతి గృహాల్లో




పారిశుద్ధ్యం, మంచినీటి వసతి, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏ ఎస్ డబ్ల్యూ ఓ లు వసతి గృహాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రులకు లీప్ ఇయర్ డౌన్లోడ్ చేయించాలని తెలిపారు. గత ఏడాది కంటే మరింత ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఐ వి ఆర్ ఎస్ సర్వేలో పర్ఫెక్షన్ తగ్గిపోయిందని దీన్ని మరింత మెరుగుపరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విధి నిర్వహణ, విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఇఓ సుబ్బారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మా నాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# క్రాప్ లైఫ్ ఇండియా' సేవలు అభినందనీయం..! -జిల్లా కలెక్టర్ రాజాబాబు

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం, జూలై 22:**

వ్యవసాయంలో ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న 'క్రాప్ లైఫ్ ఇండియా' స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఢిల్లీకి చెందిన ఆ సంస్థ ప్రతినిధులు వరుణ్ వశిష్ట్, ఆశిష్ తివారీ గతవారం వలేటి వారిపాలెం మండలం సమీరపాలెం గ్రామంలో 'పల్లెనిద్ర' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సంస్థ తరపున చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయ శాఖ సహకారంతో జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ ఎరువుల రహిత సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ సంస్థ కార్యక్రమాలను కలెక్టర్ ప్రశంసిస్తూ విచక్షణారహితంగా ఎరువుల వినియోగం వలన ఆహార పదార్థాలలో వాటి అవక్షేపాలు ఉండి క్యాన్సర్ ప్రమాదానికి దారితీస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేలా క్రాప్ లైఫ్ ఇండియా విస్తృతంగా రైతులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని చెప్పారు. కాగా, రబీ సీజన్ లో కూడా మరోసారి జిల్లావ్యాప్తంగా తాము పర్యటిస్తామని ప్రతినిధులు తెలిపారు.



## కందుకూరు ఐసీడీఎస్‌లో అంగన్వాడీ ఆయాల భర్తీకి నోటిఫికేషన్



**కందుకూరు పెన్ పవర్, జూలై 22**

కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 4 అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి సమగ్ర శిశు అభివృద్ధి సేవాపథకం (ఐసీడీఎస్) అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నియామక ప్రక్రియ చేపట్టినట్లు సీడీపీవో కె. ఉషారాణి తెలిపారు. కందుకూరు మండలంలోని దివివారిపాలెం1, మోపాడు-1, వి.వి.పాలెం మండలంలోని పోకూరు-1, రామచంద్రపురం అంగన్వాడీ కేంద్రాల్లో జనరల్ కేటగిరీకి చెందిన ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై, దరఖాస్తు చేస్తున్న గ్రామ పరిధిలో నివసించే వివాహిత మహిళలు అయి ఉండాలి. వయస్సు 01-07-2026 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన ఆయాలకు నెలకు రూ.7,000 గౌరవ వేతనం అందజేయనున్నారు. జూలై 23 నుంచి ఆగస్టు 1 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. పూర్తి వివరాలకు కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

## శివరాం మద్దతు కోరిన డాక్యుమెంట్ రైటర్స్



**కందుకూరు పెన్ పవర్, జూలై 22:**

కందుకూరు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు , స్టాంప్ వెండర్స్ బుధవారం కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం ను కలిసి తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలని , జీవో నెంబర్ 396 ను తక్షణమే రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని శివరాంకు వివరించారు. శివరాం ను కలిసిన వారిలో కోక రంగారావు , గుండవరపు మల్లిఖార్జున , వరికూటి శివరాం , పూరిమిట్ల రవి , ఉన్నం సతీష్ , హఫీజ్ తదితరులు ఉన్నారు.

## పలుకూరు పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### -14 మంది అరెస్ట్.. రూ.1.02 లక్షల నగదు, 10 బైక్‌లు స్వాధీనం



**కందుకూరు పెన్ పవర్, జూలై 22:**

కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు, కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం సూచనల మేరకు సీఐ షేక్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై బాలకృష్ణ, సిబ్బంది బుధవారం ఈ దాడి చేపట్టారు.పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పలుకూరు గ్రామ పరిధిలోని పొలాల్లో కోతముక్క పేకాట ఆడుతున్న సమయంలో దాడి చేసి, 14 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,02,000 నగదు, 14 మొబైల్ ఫోన్లు, 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా కందుకూరు డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, కోడిపందేలు, ఇతర జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎల్ నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది

**గిద్దలూరు పెన్ పవర్ జులై 22**

గిద్దలూరు మండలం లో ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి "ఎల్ నినో ప్రభావం- వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు " గురించి, ఎల్నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఒక వాతావరణ మార్పు. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా భారతదేశం లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలపై దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. వ్యవసాయ రంగంపై ఎల్నినో చూపే ప్రధాన ప్రభావాలు రైతులకు తెలియజేయడం జరిగింది. రుతుపవనాల బలహీనత -- కరవు పరిస్థితులు, ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం, దిగుబడి తగ్గుట,భూగర్భ జలాలు, జలాశయాల మట్టాలు పడిపోవడం, విపరీతమైన వేడి,ఉష్ణోగ్రతలు పెరుగుదల, పశుగ్రాసం కొరత,ఆర్థిక భారం -- ద్రవ్యోల్బణం?పంటల దిగుబడి తగ్గడం వల్ల మార్కెట్‌లో ఆహార ధాన్యాలు, కూరగాయలు, నూనె గింజల ధరలు విపరీతంగా పెరుగుతాయి తెలియజేసారు. ఈసందర్భంగా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు నివారణోపాయాలను వివరించారు. తక్కువ నీటితో పండే పంటలు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు



బదులుగా తృణధాన్యాలు (జొన్నలు, సజ్జలు, రాగులు), ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలను ఎంచుకోవాలని నీటి యాజమాన్యం బిందు సేద్యం లేదా చిలకరింపు సేద్యం పద్ధతులను వాడి నీటిని ఆదా చేయాలని స్వల్పకాలిక రకాలు: తక్కువ రోజుల్లో చేతికి వచ్చే పంట రకాలను సాగు చేయాలి.

**తేమ సంరక్షణ:** నేలలో తేమ ఆవిరైపోకుండా మల్చింగ్ పద్ధతులను పాటించడం మంచిదని తెలిపారు.



గ్రామ సభ అనంతరం భూసార పరీక్షల విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేసి తర్వాత గ్రామంలోని పత్తి, ఆముదం పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన గావించి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు వాటి నివారణ చర్యలు రైతుల కు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దయ్య,కిరణ్ , రైతులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధి బాలికా విధ్యాలయాల సమగ్ర అభివృద్ధికి చర్యలు

### - మాగుంట ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి జవాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 22**

దేశంలోని కస్తూరిబా గాంధి బాలికా విద్యాలయాలలోని మౌలికసదుపాయాలు అంచనా, ప్రయోగ శాలలు తరగతిగదులు,భోదనా పోస్టులు మంజూరు, కార్యక్రమాలు అమలు, పనిచేయుచున్న ఏజన్సీల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి సమాదానమిస్తూ - దేశంలోని కస్తూరిబా గాంధి బాలికా విధ్యాలయాలకు సంబంధించి అన్ని విషయాలపై అధ్యయనానికి 2022-23 లో పాఠశాల విద్యాశాఖ నియమించబడినదని తెలిపారు. మౌలికసదుపాయాలు అంచనా,



ప్రయోగశాలలు, తరగతిగదులు, భోదనా పోస్టులు మంజూరు, కార్యక్రమాలు అమలు, ఏజన్సీల పనితీరుతోపాటు, ఆర్ధిక నిర్వహణ, పరిపాలన, విద్యార్థులు -- తల్లితండ్రులు ఆద్యాపకులు, వార్డెన్ల అధికారుల నుండి అభిప్రాయాలను సేకరించి విధ్యాలయాల అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి పరచుటకు సూచనలతో నివేదిక పంపుతుందని తెలిపారు. వారి నివేదిక ప్రకారం ఇంటర్ వరకు తరగతులను పెంపుదల, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మాణం, భోధనాబ్యాస సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు, క్రీడా సౌకర్యాలు ఏర్పాటు అధ్యాపకులకు, వార్డెన్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దేశంలో మొత్తంలో 4,205 సాంకేతిక ప్రయోగశాలలు మంజూరు కాగా, 3,143 పనిచేస్తున్నాయని, 4,381 తరగతి గదులకు గాను 3,088 పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ లో మంజూరైన 497 ప్రయోగశాలలు, 497 తరగతి గదులు మొత్తం పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 37 విద్యాలయాలు పనిచేస్తున్నాయని, అందులో 33 లో ప్రయోగశాలలు, తరగతి గదులు ఏర్పాటు చేయబడ్డాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## జూలై 24న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



**కందుకూరు పెన్ పవర్, జూలై 22**

జూలై 24న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కందుకూరు ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ సహా పలు జాతీయ ప్రవేశ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేసి, వైద్య ప్రవేశాలను రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్య అనేది రాష్ట్రాల హక్కులను దెబ్బతీసే విధంగా కాకుండా, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ ఉండాలని అన్నారు. పరీక్షలలో జరిగిన అవకతవకలను ప్రశ్నిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువకులపై పోలీసులు కర్కశంగా లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై దమనకాండకు పాల్పడడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, లాఠీచార్జ్‌కి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును కాపాడడం కోసం, పరీక్షల వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం కోసం, విద్యార్థుల హక్కులను పరిరక్షించడం కోసం జూలై 24న నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లలితేష్, మన్సూర్, సాయిల్ పటాన్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో జగన్‌ను కలిసిన బుర్రా

### -పొగాకు రైతు సమస్యను జగన్ దృష్టికి తీసుకెళ్లిన బుర్రా
### -రామాయపట్నం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించిన పార్టీ ప్రతినిధులపై పెట్టిన కేసులను జగన్ దృష్టికి తీసుకెళ్లిన బుర్రా

**కందుకూరు పెన్ పవర్, జూలై 22:**

బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో జరిగిన పొగాకు రైతుల సమావేశం సందర్భంగా మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రత్యేకంగా మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గంలో రైతుల ప్రధాన పంటగా ఉన్న పొగాకు గిట్టుబాటు ధర రాక, పెట్టిన పెట్టుబడులు కూడా రైతుచేతికి వచ్చే పరిస్థితి లేక దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని దీనివలన రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని జగన్ కు వివరించి చెప్పడం జరిగినది.ఇప్పటికే మన పార్టీ ఆధ్వర్యంలో రైతులకు సంఘీభావంగా బోర్డును సందర్శించడం,వేలం అధికారులకు వినతి పత్రం సమర్పించడం, రైతుల పక్షాన నిలబడి మద్దతు ధర కోసం ఆందోళన చేసినట్లు తెలిపారు. రైతు ప్రతినిధులుగా వెళ్లిన మన పార్టీ కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ నాయకులతో తప్పుడు రిపోర్టు ఇప్పించి కేసులు నమోదు చేశారని ఆ వివరాలను అందించడం జరిగినది. పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించే దానికి మన ప్రభుత్వంలో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన సంగతి జ్ఞప్తికి తెచ్చారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం రామాయపట్నం పోర్టును అత్యంత చౌకగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మటం చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు జరిపిన పోరాటాన్ని బుర్రా మధుసూదన్ యాదవ్ జగన్మోహన్ రెడ్డికి వివరించారు. చలో రామాయపట్నం కార్యక్రమంలో వైసీపీ నాయకులు పైన పోలీసులు ఒత్తిడి తెచ్చి కార్యక్రమానికి హాజరు కాకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం దానిని సైతం ఎదుర్కొన్న వైసీపీ శ్రేణులు వేలాదిగా పోర్టు ముట్టడి కార్యక్రమానికి హాజరైన సంఘటన, పోలీసులను ఏర్పాటు చేసి కార్యకర్తలను అడ్డుకున్న తీరును పూసగుచ్చినట్లు వివరించి చెప్పారు. రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలబడి స్థానిక రైతులకు, యువతకు అండగా నిలిచిన



కార్యకర్తలు 20 మందిపై పోలీసులు వీఆర్వో ద్వారా తప్పుడు రిపోర్టు తీసుకొని కేసులు కట్టారని ఆ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును గురించి జగన్ దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రభుత్వ రంగంలో దాదాపు 5 వేల కోట్లు పెట్టి మీరు నిర్మించిన రామాయపట్నం పోర్టును అమ్ముతున్నారని మీరు సంకల్పించిన ప్రయోజనం సిద్ధించే పరిస్థితి లేదని గుర్తు చేశారు.బుర్రామధుసూదన్ యాదవ్ చెప్పిన విషయాలను సానుకూలంగా విన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తెప్పించుకుంటున్నానని పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు గాని,పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించే పోరాటంలో గాని,రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో గాని క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని అవసరమైతే మన పార్టీ సెంట్రల్ ఆఫీస్ నుంచి కార్యాచరణ కూడా ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం దిగి రాకపోతే కందుకూరు ప్రాంతానికి వచ్చి రామాయపట్నం పోర్టు రైతులు, యువకులకు న్యాయం జరిగే వరకూ పోరాడుదామని,పొగాకు రైతుల సమస్యపై కందుకూరు కూడా వస్తానని జగన్మోహన్ రెడ్డి తెలియజేశారని మధుసూదన్ తెలిపారు.

## మహిళా వ్యాపారవేత్తలను తీర్చిదిద్దాలి

### నూరు శాతం రుణాల రికవరీ జరగాలి.
### అద్దంకి వెలుగు ఏపీఎం జ్యోతి. ప్రసాద్ బాబు.






**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 22**

అద్దంకి వెలుగు కార్యాలయంలో బుధవారం గ్రామ సమాఖ్య సహాయకులు, మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం జ్యోతి. ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తీసుకున్న రుణాలకు సంబంధించి నూరు శాతం రికవరీ పూర్తి కావాలన్నారు. అదేవిధంగా అర్హత ఉన్న ప్రతి సంఘానికీ రుణాలు అందేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి వీవోఏ తన పరిధిలో కనీసం 15 మంది మహిళా వ్యాపారవేత్తలను తీర్చిదిద్దేలా ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ?అనంతరం ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి మహిళా సంఘానికి బ్యాంకు ద్వారా నిరభ్యంతరంగా రుణాలు అందజేస్తామని వీవోఏలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీలు, అకౌంటెంట్లు, వివిధ సంఘాల అధ్యక్షులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారిగా ప్రగడ శ్రీనివాసులు నియామకం



**మార్కాపురం పెన్ పవర్ జూలై 22**

పెద్దారవీడు మండల విద్యాశాఖ అధికారిగా (ఎంఈఓ) సమర్థవంతంగా సేవలందిస్తున్న ప్రగడ శ్రీనివాసులుని మార్కాపురం డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారిగా (డిప్యూటీ ఈఈఓ) నియమించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పెద్దారవీడు మండలంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రగడ శ్రీనివాసులు విశేష కృషి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను మెరుగుపరచడం, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, ప్రభుత్వ బడులో విద్యార్థుల రోల్ పెంచడం,బోధన-అభ్యసన ప్రక్రియను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధ్యాయులతో సమన్వయం సాధిస్తూ ప్రభుత్వ విద్యా కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యావేత్తలు ప్రగడ శ్రీనివాసులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారంపై ప్రభుత్వం తన వైఖరి ప్రకటించాలి

## 2013 భూ సేకరణ పునరావాస చట్టాన్ని అమలు చేయాలి -సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డికేఎం రఫీ





**మార్కాపురం పెన్ పవర్ జూలై22**

శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో మూడోరోజు ఆర్డిఓ కార్యాలయం ఎదుట దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డికేఎం రఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వస్వాన్ని త్యాగం చేస్తున్నటువంటి వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సిగ్గుచేటని అన్నారు. మూడు రోజులుగా వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసిత యువతీ యువకులు మాకు న్యాయం చేయమని ఆర్డీవో కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వం తన వైఖరి వెల్లడించకుండా మొండి వైఖరితో ఉందని అన్నారు. 2013 చట్టం ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్య నాటికి నిర్వాసితుల్లో 18 సంవత్సరాలు నిండిన వారందరికీ పరిహారం చెల్లించాలని చట్టం చెప్తున్నా చట్టాన్ని తయారుచేసిన వారే అమలు అమలుకు వెనుకాడటాన్ని ఆయన ఖండించారు. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ప్రాజెక్టు కొరకు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కొరకు సర్వం త్యాగం చేయడం గ్రామాలు, ఇంటిని పొలాలను వదిలి వెళ్ళనున్న నిర్వాసితులకు పరిహారం విషయంలో ద్వంద వైఖరిని మానుకోవాలని అన్నారు. నిర్వాసితుల పోరాటం ఉదృతంగా మారే లోపు ప్రభుత్వం నిర్వాసితులతో చర్చలు జరిపి పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కో కన్వీనర్లు దగ్గుపాటి సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మ బాల నాగయ్య, పందిటి రూబేను సిఐటియు పట్టణ కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ నాయకులు కే విజయ్ కుమార్, డి వందన్ కుమార్ నిర్వాసితుల సంఘం కార్యకర్తలు బొల్లవరం మల్లికార్జున, మండ్ల అనిల్, మద్దూరి శసింద్ర, పానుగంటి రంగ సాయిలు, పసుపులేటి శ్రీనివాసులు, నాలి ప్రసాదు, బుర్రి వెంకటేశ్వర్లు, కుందూరు అంజిరెడ్డి, కొర్రపోలు దేవ సహాయము, తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించినారు.

# పేకాట శిబిరంపై దాడి



**పొన్నలూరు పెన్ పవర్ జూలై 22**

మండలంలోని విప్పగుంట ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అదుపులో తీసుకున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వటంతో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 3150 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్. అశోక్ కుమార్ దంపతులు



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 22**

అద్దంకి మండలం, చక్రాయపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు కిషన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్, ఆయన సతీమణి డాక్టర్ రమ్య హారిక దంపతులు హాజరయ్యారు. పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి కిషన్‌ను వారు ప్రత్యేకంగా ఆశీర్వదించి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జన్మదిన వేడుకల కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు, పార్టీ శ్రేణులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీ పై ప్రశ్నిస్తే విద్యార్థులను రక్తం వచ్చేలా కొడతారా

## - మోడీది రాక్షస పాలన - కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 22**

దేశ ప్రధాని రాక్షస పాలన కొనసాగిస్తూ ప్రజల రక్తాన్ని కళ్ళ చూస్తూ ఆనందం పొందుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం మొత్తం ఢిల్లీ వైపు చూస్తుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులపై లాఠీల వర్షం, టియర్ గ్యాస్, రక్తంతో జంతర్ మంతర్ సాక్షిగా ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. నీట్ ప్రశ్నాపత్రాలు లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 20,21 తేదీలలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ప్రధాని చేతకాని పాలనకు నిదర్శనం అన్నారు. మోడీ పాలనలో 88 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీ కి బాధ్యత వహించాలంటూ సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ 22 రోజులుగా ఆవరణ నిరాహార దీక్ష చేసినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కనీస స్పందన కరువైందని అన్నారు. 22వ రోజున బలవంతంగా, పాశవీకంగా, దారుణంగా లా కెళ్ళి హాస్పిటల్లో చేర్పించారు అన్నారు. అయినప్పటికీ సోనం వాంగ్ చుక్ హాస్పిటల్లో కూడా దీక్షలు చేపట్టారన్నారు. దీంతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న దేశ యువతను పట్టుకోవడం ఎవరి తరం కాలేదన్నారు. వీరి ఉద్యమానికి మద్దతుగా కాంగ్రెస్ తో పాటు, ఇండియా కుటుంబంలోని పార్టీలన్నీ నిలిచాయన్నారు. వీరితో పాటు ఉద్యమంలో పాలు పంచుకున్నాయన్నారు. చివరకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా చర్చలు జరిపిన ఫలితం శూన్యంగా మారిందన్నారు. ఢిల్లీలోని విద్యార్థి ఉద్యమానికి, రైతాంగ ఉద్యమానికి సిపిఐ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ హర్యానా, పంజాబ్ రైతాంగాన్ని ఢిల్లీలోకి అడుగుపెట్టనివ్వకుండానే ఢిల్లీ సరిహద్దులలో



అడ్డుకోవడం ప్రధాని సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. కనీసం రైతుల గోడును వినేందుకు కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం లోని మోడీ కి రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, జగన్ వంత పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై ఇంత ఘోరం జరుగుతున్న ఒకరు రాక్షస పాలనను వ్యతిరేకించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు ఆరో తేదీ నుండి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు సిపిఐ నిర్వహిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 1వ తేదీన చలో పార్లమెంటు కార్యక్రమాలు కూడా జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలమైందన్నారు. కరెంట్ బిల్లులు పెంచమని చెప్తూనే, మరోపక్క యదేచ్ఛగా పెంచుతున్నారన్నారు. కొత్త పింఛన్ల జాడ లేదన్నారు. 22 ఏ సమస్య అలాగే ఉందన్నారు. డీకే భూముల రైతులకు ఎటువంటి రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందటం లేదని అన్నారు. బజ్జీనియా పొగాకు మద్దతు ధర కోరుతూ ఈనెల 23వ తేదీ నుండి, 26వ తేదీ వరకు నిర్వహించే బైకు ప్రచార జాత కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు కరుణానిధి పాల్గొన్నారు.

# డి డి ఓ గా వెళ్తున్న ఎంపీడీఓ సుజాతకు ఘన సన్మానం



**పొన్నలూరు పెన్ పవర్ జూలై 22**

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం డి డి ఓ గా వెళ్తున్న ఎంపీడీఓ డాక్టర్ పి సుజాత కు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గా పనిచేసి మార్కాపురం జిల్లాకు డి డి వో గా బాధ్యతలు చేపట్టిన సుజాతకు మండలంలోని నాయకులు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో ఆమె చేసిన కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, మన్నెం రమణయ్య, మండవ మురళీమోహన్, వడ్డే మాల్యాద్రి, ఉన్నం కొండలరావు, పల్లపోతు రమేష్ బాబు, అనుమోలు సుధాకర్ బాబు, తానికొండ మహేంద్ర, రమణారెడ్డి, ఉన్నం శ్రీనివాసరావు, గెట్టబోయిన మల్లికార్జున రావు, డి మధుసూదన్ రావు, ఎర్ర నరేంద్ర కుమార్, చల్లా శ్రీనివాసరావు, పిల్లి వెంకటనారాయణ రెడ్డి, తాసిల్దార్ వి పుల్లారావు,మండలంలోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

**మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. బుధవారం నాడు మండలంలోని ఇవ్వలేరు, కొత్తపాలెం, బుచ్చన పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులతో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి సమావేశం జరిపి, వ్యవసాయపరంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు. అలాగే సీజన్లో సాగు చేయాల్సిన పంటల గురించి ఆయన రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అదేవిధంగా కౌలు రైతులు పాటించాల్సిన పద్ధతుల గురించి కూడా వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తోపాటు ఆయా గ్రామాల్లోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బూరి రమేష్ చొరవతో విద్యుత్ సమస్యను పరిష్కరించిన ఏఈ రమేష్ -కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



**సి.ఎస్.పురం, పెన్ పవర్ జూలై 22**

మండల కేంద్రంలోని సి. ఎస్. పురం ఎస్టి కాలనీతో పాటు ఎనిగడ్డ బజార్ దొడ్లో కొండయ్య ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభాలు లేక స్థానిక ప్రజలు రాత్రి వేళల్లో చీకటి కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ స్వయంగా పరిశీలించి, కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు, విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం కల్పించారు. ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ప్రజల నుంచి ఏ సమస్య వచ్చినా ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమాంతరంగా కొనసాగిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ ఏఈ రమేష్ మాట్లాడుతూ విద్యుత్తు సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని, విద్యుత్ సమస్యల గురించి సమాచారం అందిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ మేడం వెంగళరెడ్డి మృతి





**కొమరోలు పెన్ పవర్ జూలై 22**

సీనియర్ ఫిజికల్ డైరెక్టర్, మండల విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం సీనియర్ నాయకులు మేడం వెంగళ రెడ్డి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంగళరెడ్డి ని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఆయన ఆరోగ్యం మరింత విషమించటంతో బుధవారం తెల్లవారుజామున వెంగళ రెడ్డి ఒంగోలులోని ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంగల రెడ్డి మృతి పట్ల మండలంలోని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు విశ్రాంత ఉద్యోగులు వెంగళ్రెడ్డి బంధుమిత్రులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో దీర్ఘ కాలం పాటు పి ఈ టి గా, ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేసి ఎంతోమంది యువతీ యువకులను తీర్చిదిద్దారు. పదవి విరమణ అనంతరం ఆయన మండల విశ్రాంత ఉద్యోగుల స్థానం సంఘాన్ని స్థాపించి అధ్యక్షులుగా పని చేసి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. వెంగళరెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఎర్రం శెట్టి వాని పల్లెలో బుధవారం కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలు తో నిర్వహించారు.

# డ్వామా పిడిని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నేత మాకం అబ్రహం

**మార్కాపురం పెన్ పవర్ జూలై22**

మార్కాపురం జిల్లా కు మొట్టమొదటిగా మహిళ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పిడి సువార్తను మార్కాపురం మండల టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి మాకం అబ్రహం పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం మండలం లో ఉపాధి హామీ పనులను మెరుగుపరచాలని, మండల ప్రజలకు ఉపాధిని కల్పించి వారి అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. ఈ సందర్భంగా పిడి సువార్త తప్పకుండా మార్కాపురం జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రజల మన్ననలు పొందే విధంగా సిబ్బందికి దిశ నిర్దేశం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.



# అగ్నిధార కురిపించిన అభ్యుదయ కవి దాశరథి

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 22**

ప్రముఖ తెలుగు కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ విమోచన ఉద్యమ కవి. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కవిత్వంతో ప్రజల్లో చైతన్యం కలిగించిన అగ్నిధార దాశరథి కృష్ణమాచార్యులు అని ఒంగోలు నగర పాలక సంస్థ విశ్రాంత కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ పేర్కొన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రం ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. జానుడి- సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో వెంకట కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నా తెలంగాణ కోటి రత్నాల వీణ అనే ఆయన వాక్యం ఎంతో ప్రసిద్ధి చెందిందని, అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, తిమిరంతో సమరం తదితర కవితా సంపుటాలు వెలువరించి ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యమ కవిగా కీర్తిని పొందారన్నారు. ఆయన రాసిన ఆ చల్లని సముద్ర గర్భం గేయం ఉద్యమ సామాజిక గాయకులు తప్పనిసరిగా పాడే గేయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవిగా కూడా సేవలందించిన ఆయనకు నివాళులు అర్పించడం



తెలుగు సాహిత్య ప్రపంచానికి గౌరవకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు సిటిజన్ ఫోరమ్ అధ్యక్షుడు కొల్లా మధు,శంకర్, ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసరావు, డాక్టర్ తిమ్మిరి రవీంద్ర, అంగలకుర్తి ప్రసాద్, జంధ్యం రాధారమణ గుప్తా,మద్దు అరవింద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి




**గిద్దలూరు పెన్ పవర్ జులై 22**

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు వైసిపి నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎర్రగొండపాలెం పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని ప్రవీణ్ కుమార్ రెడ్డి కలిశారు. కొద్దిగా సేపు వివిధ అంశాలపై మాట్లాడిన ఆయన గిద్దలూరు నియోజకవర్గంలోని పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడారు. స్థానిక రాజకీయ పరిస్థితులపై అడిగి తెలుసుకుని పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్లాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి కి సూచించారని . అలానే పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల - సిడిపిఓ సుధ

**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 22**



సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ సుధా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు బీసీ కేంద్రం, సంతమాగులూరు బీఎన్ స్పాండ్ కేంద్రం, అడవిపాలెం మెయిన్ కేంద్రం, కందుకూరు ఎస్సీ కేంద్రం, బల్లికురవ మండలంలోని మల్లయపాలెం మెయిన్-1 కేంద్రం, కొనిదెన ఎస్సీ కేంద్రం, కొత్త బొమ్మలమడక ఎస్సీ-1 కేంద్రాల్లో ఖాళీల భర్తీకి జూలై 22 నుంచి ఆగస్టు 1 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం కలిగి ఉండటంతో పాటు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 2026 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7,000 గౌరవ వేతనం చెల్లిస్తారని చెప్పారు. దరఖాస్తులతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం తదితర పత్రాలను జతపరచాలని సూచించారు. పూర్తి వివరాలకు సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలని సీడీపీఓ సుధా కోరారు.

# మాజీ ముఖ్యమంత్రిని కలిసిన జిల్లా రైతు వింగ్ వైస్ ప్రెసిడెంట్ కట్టా

**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 22**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ తో పొగాకు రైతులు బుధవారం సమావేశమయ్యారు. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, వర్యులు వైయస్ . జగన్ మోహన్ రెడ్డి తో జిల్లా రైతు వింగ్ వైస్ ప్రెసిడెంట్ కట్టా హనుమంతరావు సమావేశమై పలు విషయాలు చర్చించారు. పొగాకు ధరల సంక్షోభం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యంపై జగన్ తో మాట్లాడినట్లు కట్టా హనుమంతరావు తెలిపారు. వేలం ప్రారంభమై 94 రోజులు గడిచినా పొగాకు కొనుగోళ్లు పూర్తికాలేదని జగన్ మోహన్ రెడ్డి తో తమ ఆవేదన వెలిబుచ్చారు. వేలం కేంద్రాల్లో 30 నుంచి 40 శాతం వరకు నో బిడ్స్, రిజెక్షన్లు నమోదవుతున్నాయని వెల్లడించినట్లు తెలిపారు. తిరస్కరించిన ఒక్కో బేలును మళ్లీ వేలానికి తీసుకురావడానికి కనీసం రూ.1,000 అదనపు భారం పడుతోందన్న తమ భాదను మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కో బ్యారన్‌పై రైతుకు రూ.5 లక్షల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. పంట వేసే సమయంలో ఎక్కువగా సాగుచేయాలని ప్రోత్సహించిన కంపెనీలు వేలం సమయానికి సిండికేట్‌గా మారాయని ఆరోపించారు. ఈ సమావేశంలో , అనుమోలు లక్ష్మీ నరసింహ, చెన్నిబోయిన శ్రీనివాసులు, యాళ్ళ శివ కుమార్ రెడ్డి, అప్పనబోయిన రాంబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.



# నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో అత్యాధునిక ఏఐ స్పోకెన్ ఇంగ్లీష్ ల్యాబ్ ప్రారంభం

## -విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపే లక్ష్యం

**కందుకూరు, పెన్ పవర్ జూలై 22:**

విద్యార్థుల్లో ఆంగ్ల భాషా కమ్యూనికేషన్ నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో మెరుగుపర్చే లక్ష్యంతో కందుకూరులోని ఓ.వి.రోడ్డులో ఉన్న నాగార్జున పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఏఐ స్పోకెన్ ఇంగ్లీష్ ల్యాబ్ ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.ఎన్.కె. శర్మ (ఎంఈవో-1), కె. సుబ్బారెడ్డి (ఎంఈవో-2) జ్యోతి ప్రజ్వలన చేసి ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించిన వారు, కృత్రిమ మేధస్సు ఆధారిత ఆంగ్ల భాషా బోధన విద్యార్థుల్లో వినడం, మాట్లాడడం, సరైన ఉచ్చారణ, పదసంపదతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి. షాలిని రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెస్ కరికులం, లీడ్ కరికులం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ప్రపంచ స్థాయి ఆంగ్ల భాషా అభ్యాసాన్ని పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఏ ఐ సాంకేతికతతో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందిస్తూ భవిష్యత్ పోటీ ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయడమే ల్యాబ్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.ప్రత్యేక అతిథులు జి. రామారావు, సాయిబాబా మాట్లాడుతూ,



నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం అత్యంత అవసరమని, ఏఐ ఆధారిత స్పోకెన్ ఇంగ్లీష్ ల్యాబ్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న



నాగార్జున పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని వారు అభినందించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి. శివకుమార్, యాజమాన్య సభ్యులు వి. మర్రెడ్డి, కె. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ సమగ్ర అభివృద్ధికి నాగార్జున పబ్లిక్ స్కూల్ కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# నవోదయలో రీజినల్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 22**

ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటరావు ముఖ్య అతిథిగా వచ్చి బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి, భావోద్వేగాలను అదుపులో ఉంచుకొనేందుకు క్రీడలు దోహదం చేస్తాయని, అలాగే ప్రతి క్రీడా కారుడు క్రమ శిక్షణ, ప్రణాళిక తో ఆటలు ఆడాలి అప్పుడే క్రీడలలో పేరుతో పాటు విలువలు కలిగిన మంచి విజేతలు కాగలరని పేర్కొన్నారు. విద్యా లయం ఇన్ చార్జి ప్రిన్సిపల్ ఎ. రఘు మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లో పాల్గొనడం ముఖ్యమని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ ప్రాంగణంలో విజయవంతంగా బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ రీజినల్ బాక్సింగ్ పోటీలను నిర్వహించెందుకు అవకాశం ఈ విద్యాలయంకు ఇచ్చినందుకు నవోదయ విద్యాలయం హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ బి. చక్రపాణి , క్లస్టర్ అసిస్టెంట్ కమీషనర్ హేమలత వారికి ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎ.రఘు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి పరిధిలోని విద్యాలయాల నుండి అండర్ -14, అండర్ -17, అండర్ 19 విభాగాలలో బాల,బాలికలందరు బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యాలయం సీనియర్ టీచర్ తాతయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.కిషోర్ కుమార్, విద్యాలయ సిబ్బంది అందరు మరియు వివిధ విద్యాలయాల ఎస్కార్ట్ టీచరులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 24న కొమరోలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

## మధ్యాహ్నం రెండున్నర నుంచి శ్రీ రామ యోగి కళ్యాణ మండపంలో నిర్వహణ

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలు పాల్గొననున్న మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత తదితర జిల్లా స్థాయి అధికారులు







**కొమరోలు పెన్ పవర్ జూలై 22**

కొమరోలులో ఈనెల 24వ తేదీన గిద్దలూరు నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లుగా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కొమరోలు లోని శ్రీ రామ యోగి కళ్యాణ మండపంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి నిర్వహించనున్నట్లుగా వారు తెలిపారు. ఆ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత,సబ్ కలెక్టర్ పులి శ్రీనివాసరావు, తోపాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వారు తెలిపారు. కావున కొమరోలు మండలంలోని ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవలసిందిగా వారు కోరారు.

# రైతులు పంటల బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 22**

ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది ని సంప్రదించి పంట నమోదు మరియు పంటల భీమా పథకాలను ఉపయోగించుకోవలెనని మండల వ్యవసాయ అధికారి పి. మధుబాబు తెలిపారు.మండలం లోని చిన్నపునాయునిపల్లి , చంద్రశేఖరపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులతో కలిసి వరి నారు మడి మరియు పసుపు తోటలను పరిశీలించి పాటించాల్సిన మెలుకువలను తెలియజేశారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు డిఏపి అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఖరీఫ్ సీజన్లో వరి, కంది, సజ్జ, ఎండు మిరప, మినుము సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆగష్టు 15వ తేదీ లోపల చెల్లించినట్లయితే భీమా పొందుటకు అర్హులని, ప్రీమియం చెల్లించి జులై 31వ తేదీ లోపు పీఎంఎఫ్ బీవై. జీవోవీ.ఇన్ వెబ్ సైట్




ద్వారా నమోదు చేసుకున్నట్లయితే భీమా పొందవచ్చని అన్నారు అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి , గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న ముత్తుముల ఎల్లారెడ్డి

**కొమరోలు పెన్ పవర్ జూలై 22.**

విజయవాడలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనిట్ ఇన్చార్జిల రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో కొమరోలు మండలం బాదినేని పల్లె పంచాయతీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డికి రాష్ట్ర మంత్రివర్యులు అనగానే సత్య ప్రసాద్ ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ఆ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సారధ్యంలో ఆయన ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి



తన వంతుగా కృషి చేస్తున్నానని,అంతేకాక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లుగా వివరించారు. దూర దృష్టి, రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, సేవాభావం, రాజకీయంగా పరిణతి పొంది, దేశంలోనే సీనియర్ నాయకులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా లభించడం ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టంగా ఆయన అభివర్ణించారు.

# గిద్దలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## రోడ్డు ప్రమాదంలో రెండేళ్ళ చిన్నారితో సహా ఇద్దరు మృతి..

## మరో నలుగురికి తీవ్ర గాయాలు..

## గిద్దలూరు - అనంతపురం హైవే రోడ్డుపై ఘటన






**గిద్దలూరు, పెన్ పవర్ జూలై 22**

వివిధ పుణ్యక్షేత్ర సందర్శనలో భాగంగా శ్రీశైలం వెళ్తున్న ఓ యాత్రిక బృందం ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై రెండేళ్ళ చిన్నారితో సహా ఇరువురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన ఘటన గిద్దలూరు పట్టణ సమీపంలో ( చాణిక్య స్కూల్ సమీపంలో) హైవే రోడ్డుపై బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మాల్ గ్రామానికి చెందిన వారు పుణ్యక్షేత్ర సందర్శన కోసం తిరుపతి నుంచి మహానంది వెళ్లి అక్కడ్నుంచి శ్రీశైలం వెళ్లే నేపథ్యంలో గిద్దలూరు పట్టణ శివార్లలో ఆర్టీసీ బస్సును దాటుకునే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీ కొట్టారు.దీంతో కారు (ఎ.పి 10 బి.జి 2929) లో ప్రయాణిస్తున్న శేఖర్(40),బాబు(2)అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.కారులోని మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ.



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 22**

గుడ్లూరు మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనదని, ఆయా ప్రాంతాల్లో అర్హత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూపర్వైజర్ కె.కామేశ్వరి బుధవారం తెలిపారు. ఈ నెల 22 నుండి ఆగస్టు 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయని ఆమె తెలిపారు. మోచర్ల-1 ఎస్.సీ(గ్రూప్-3), మొగుళ్లూరు జనరల్, గుడ్లూరు-1 ఎస్.సీ(గ్రూప్-3), పూరేటిపల్లి-1 జనరల్ కు కేటాయించదమైనదని ఆమె తెలిపారు. ఉలవపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నందు దరఖాస్తులు స్వీకరించబడునని సూపర్వైజర్ కామేశ్వరి తెలియజేశారు.

# మండలంలోని నాగులవరం, కాకర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం






**అర్ధవీడు, పెన్ పవర్, జూలై 22**

అర్ధవీడు మండలంలోని నాగులవరం, కాకర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సబ్బా మనోహర్ పాల్గొని గ్రామాల్లో సాగు చేస్తున్న పత్తి, టమాట పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వాతావరణ బీమా పథకం క్రింద సాగు చేసిన పంటలను ఈనెల 31 లోగా బీమా చేసుకోవాలని సూచించడం జరిగింది.

అలాగే మండలంలో యూరియా, డి ఏ పి ఎరువులు మనకు కావలసిన అంత నిల్వలు ఉన్నవి. వీటి అమ్మకాలు ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా మాత్రమే జరుగును. కాబట్టి రైతులు ఈ పంట నమోదు చేసుకొని మీరు సాగు చేసిన పంటల ఆధారంగా ఎరువులు కొనుగోలు చేసుకోవాలని తెలిపినాము . ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి రైతులు కంది, ఆముదం, మినుములు వంటి బెట్టను తట్టుకునే పంటలు మాత్రమే సాగు చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది బాల వెంకటేశ్వర్లు షేక్ ఉమర్ లు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో శాస్త్రోక్తంగా హనుమద్ హోమం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 22**

ఒంగోలు లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం క్షేత్ర పాలకుడు శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు భక్త జన నయనానందకరంగా జరుగుతున్నాయి. బుధ వారం ఉదయం శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు నిర్వహించిన హనుమద్ హోమం పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు సాయంత్రం నిర్వహించిన విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు పర్యవేక్షించారు. అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు ములుకుట్ల సుబ్రహ్మణ్య శర్మ చే సుందర కాండ పారాయణ జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

# నాసిరకం బ్లీచింగ్ పై ప్రజల ఆగ్రహం

**పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ**





**జరుగుమల్లి, జులై 22, పెన్ పవర్**

గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సరఫరా, స్వచ్ఛ గ్రామాల ప్రాధాన్యత కి భిన్నంగా ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామపంచాయితీ అధికారుల నిర్లక్ష్యం నాసిరకం బ్లీచింగ్ తో ప్రజలకు తిప్పలలు తప్పడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా రక్షిత తాగునీటి సరఫరా పథకం ద్వారా వచ్చే నీటి తో ఒళ్ళు దురదలు, జిల లు చోటు చేసుకుంటూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రజల గ్రామ పంచాయతీ అధికారులను నిలదీశారు. బుధవారం గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి గోడౌన్ లో నిల్వ ఉంచిన బ్లీచింగ్ బస్తాలను పరిశీలించడం తో బండారం వెలుగు చూసింది. బ్లీచింగ్ బస్తాల పక్కనే సిమెంట్ బస్తాలు స్టాక్ చేయడం తో ఈ పరిస్థితి నెలకొన్నట్లు ప్రజలు అధికారులను నిలదీశారు. దాంతో గ్రామ పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని బ్లీచింగ్ బస్తాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు హామీ ఇవ్వడం తో ప్రజలు వెనుదిరిగారు.

# సంతమాగులూరు సర్కిల్‌లో వరుస దొంగతనాల ఛేదన

## ఇద్దరు నిందితుల అరెస్ట్ - అరవై వేల రూపాయల నగదు స్వాధీనం



**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 22**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు, దర్శి డి.ఎస్.పి బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో, సంతమాగులూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పర్యవేక్షణలో, సంతమాగులూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు నేతృత్వంలోని పోలీసు బృందం సంతమాగులూరు, మార్టూరు, జె.పంగులూరు పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన పలు దొంగతనాలు, దొంగతన యత్నాల కేసులను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద 60000 నగదు స్వాధీనం చేసుకున్నారు . సంతమాగులూరు సీఐ కి శేషగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం సంతమాగులూరు మండలం బల్లికురవ బస్టాండ్ సెంటర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, సంతమాగులూరు, మార్టూరు, జె.పంగులూరు ప్రాంతాల్లో జరిగిన పలు నేరాల్లో తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మెలికా నాగరాజు అలియాస్ రాజు, పాలపర్తి రాజేష్‌లుగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, దుర్వ్యసనాలకు బానిసలైన వీరు కలిసి దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకుని ఈ ఏడాది ఏప్రిల్ 5న సంతమాగులూరులో బాలాజీ పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో చోరీ చేసి రెండు జతల బంగారు కమ్మలను అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం ఏప్రిల్ 30న జె.పంగులూరు మండలం ముప్పవరం గ్రామంలో, జూలై 13న మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలో చోరీ యత్నాలకు పాల్పడినట్లు, అలాగే జూలై 16న ఇసుక దర్శి--వలపర్ల గ్రామాల మధ్య వ్యవసాయ పొలాల వద్ద నుంచి మూడు నీటి మోటార్లను దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు.సంతమాగులూరు కేసులో అపహరించిన బంగారు కమ్మలను నరసరావుపేటలో విక్రయించి పొందిన అరవై వేల రూపాయల నగదును నిందితుల వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని కేసు ఆస్తిగా స్వాధీనపరచుకుని తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో భాగంగా జె.పంగులూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఒక కేసు, మార్టూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లోనూ నిందితుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. అనంతరం ఇద్దరు నిందితులను బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి అద్దంకి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

# టిడిపి విస్తృతస్థాయి సమావేశానికి విశేష స్పందన

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి ఎమ్మెల్యే ఉగ్ర




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 22**

ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన బుధవారం అమరావతి గ్రౌండ్ లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి విశేష స్పందన లభించింది ఈ సమావేశానికి మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు , యూనిట్ ఇంచార్జ్ లు, బూత్ ఇంచార్జ్ లు , గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సి విఏపి యూనిట్ ద్వారా ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అర్జీల పరిష్కారం కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రామ సమస్యల పరిష్కార పుస్తకం సిద్ధం చేసి, ప్రతి గ్రామంలోని సమస్యలను నమోదు చేసి, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామనివెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం, విద్యా సంస్కరణలు, విద్యార్థుల అభివృద్ధి కోసం విద్యా, ఐటీ మరి ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చేస్తున్న కృషిని సమావేశంలో వివరించారు. రెండేళ్ల నమ్మకం -- పాలన, అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, అలాగే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి చేరవేసి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం అనే మూడు లక్ష్యాలతో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వద్దు




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 22**

మన రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి నాశనం చేసే అమెరికాతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సిఎస్పురం బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయవద్దు వ్యవసాయాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి మారం రెడ్డి రత్నారెడ్డి మాట్లాడుతూ అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్ర మోడీ ప్రభుత్వం తహతహలాడుతోందని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ఈ ఒప్పందం అని విమర్శించారు. అమెరికా నుండి ఎటువంటి సుంకాలు లేకుండా పాలు,పాలు పదార్థాలు, కోడి మాంసం, మొక్కజొన్నలు, పత్తి, సోయాబీన్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయ్యి దేశీయంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైతులు వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు పెట్టవద్దని డిమాండ్ చేశారు. సంతకం చేస్తే ఎఫ్ టి ఏ కు వ్యతిరేకంగా మరో చారిత్రాత్మక రైతు ఉద్యమానికి సమాయత్తం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మారం రెడ్డి రత్నారెడ్డి నాయకులు అంకేపల్లి వెంకటేశ్వర రెడ్డి, సంగిశెట్టి సుబ్బయ్య,పోర్ల లక్ష్మయ్య,నారా భాస్కర రెడ్డి, సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, ముత్యాల తిరుపతిరెడ్డి,పి నర్సింలు,రత్నం, సంగిశెట్టి వెంకటసుబ్బయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో రాహుల్ గాంధీ గర్జనకు విశాఖ తోడు



**విశాఖపట్నం, పెన్ పవర్ జూలై 22**

ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం ముందు విద్యార్థుల సమస్యలపై రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నాకు విశాఖ జిల్లా కాంగ్రెస్ పూర్తి మద్దతు ప్రకటించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు మాట్లాడుతూ, ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల అవకతవకలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్న ఆయన, అవసరమైతే విశాఖలో కూడా భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పేపర్ లీకులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుక

**విద్యార్థి నాయకులకు బ్యాడ్జీల ప్రదానం**

**- నాయకత్వ లక్షణాలపై అతిథుల ప్రేరణాత్మక సందేశం**




**ఆనందపురం, పెన్ పవర్ జూలై 22**

స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ వేడుక ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కీర్తి కౌశిక్ నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను ప్రదానం చేసి, నాయకత్వం యొక్క ప్రాముఖ్యత, బాధ్యతలు, ఆదర్శ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.ఎస్. మణి మాట్లాడుతూ విద్యార్థి నాయకులు చిత్తశుద్ధి, అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత వంటి విలువలను అలవర్చుకుని తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఉత్తరాంధ్ర ప్రాంత బాధ్యుడు ఎన్. వెంకటేష్ మాట్లాడుతూ నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు బాధ్యతాయుతమైన నిర్ణయాలతో పాఠశాలలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన వాతావరణాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోయ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# కృష్ణాపురం, పద్మనాభం స్వర్ణ గ్రామ కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీ



**పద్మనాభం, పెన్ పవర్ జూలై 22**

జిల్లా స్వర్ణ గ్రామ అధికారి పూర్ణిమ దేవి బుధవారం కృష్ణాపురం, పద్మనాభం స్వర్ణ గ్రామ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లోని హాజరు, సెలవులు, ఉద్యోగుల కదలికల నమోదులను పరిశీలించి, అన్ని నమోదులను ఎప్పటికప్పుడు నవీకరించి నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే, 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన అర్హుల జాబితాను పరిశీలించి, అర్హుల వివరాలను నిబంధనలకు అనుగుణంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల స్వర్ణ గ్రామ అధికారి తదితర అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అలివేలుమంగా పాఠశాలలో అవగాహన

**యలమంచిలి, పెన్ పవర్ జూలై 22**

యలమంచిలి గాంధీనగర్‌లోని అలివేలుమంగా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి అగ్నిమాపక కేంద్రం అధికారి డి. రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది రవికుమార్, తాతాజీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్లు, పాఠశాలలు, పెట్రోలు బంకులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లలో అత్యవసర నిష్క్రమణ మార్గాలను గుర్తించుకోవడం, ప్రమాద సమయంలో అప్రమత్తంగా వ్యవహరించే విధానాన్ని వివరించారు. అలాగే అగ్నిమాపక పరికరం వినియోగాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జె. కామేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు ధీరజ్ నాగ్, శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భారత జట్టులో భారీ మార్పులు.. ఏడుగురు ఔట్, ఆరుగురు కొత్తవారికి ఛాన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన తర్వాత రేపటి నుంచి టీమిండియా క్రికెట్ జట్టు మరో విదేశీ పర్యటనకు సిద్ధమైంది. జింబాబ్వేతో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇండియా తలపడనుంది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు జూలై 23 నుంచి జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలోనే జరగనున్నాయి. కెప్టెన్‌గా టీ20ల్లో తొలి విజయం కోసం వేచి చూస్తున్న శ్రేయస్ అయ్యర్ భారత జట్టుని ముందుకు నడిపించనున్నాడు. ఈ జట్టులో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ లాంటి ప్లేయర్స్ కి ఛాన్స్ దక్కింది. 2026లో ఆడుతున్న మూడో విదేశీ టీ20 సిరీస్ కోసం సెలెక్టర్లు జట్టులో భారీ మార్పులు చేశారు.

**జట్టులోకి వచ్చిన ఆటగాళ్లు:**

రింకూ సింగ్, మయాంక్ యాదవ్: జింబాబ్వే జరగబోయే టీ20 సిరీస్ కోసం భారత జట్టు ప్రకటించిన జాబితాలో స్టార్ ఆటగాడు రింకూ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అలాగే గాయాలతో చాన్నాళ్లుగా టీమ్ కి దూరమైన పేసర్ మయాంక్ యాదవ్ రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు.

అరంగేట్రం చేయబోతున్న కొత్తవారు: ఇప్పటి వరకు జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేయని యువ బౌలర్లు అశోక్ శర్మ, యష్ ఠాకూర్ ఈ సిరీస్ కోసం తొలిసారి బీసీసీఐ నుంచి పిలుపువచ్చింది.

హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్: వన్డేలు ఆడిన విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబేకి కూడా తొలిసారి టీ20ల్లో ఆడేందుకు కాల్ వచ్చింది. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరపున అత్యధిక రన్స్ చేసిన వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**జట్టుకు దూరమైన ప్లేయర్స్:**

సంజూ శాంసన్ పై వేటు: ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను సెలెక్టర్లు ఈ సిరీస్ కి పక్కనబెట్టారు. ఈ నిర్ణయంపై అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీపై ఫ్యాన్స్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

పేసర్లు, ఆల్‌రౌండర్లు: అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాలతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు ఈ సిరీస్‌లో రెస్ట్ ఇచ్చారు.

వరుణ్ చక్రవర్తి గాయం: తొలుత బీసీసీఐ ప్రకటించిన జట్టులో ఉన్న స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో గాయపడటంతో ఈ సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతని స్థానంలో రవి బిష్ణోయ్‌ను మళ్లీ తుది జట్టులోకి తీసుకున్నారు.

**జట్టులో స్థానం పదిలం చేసుకున్న ఆటగాళ్లు వీళ్లే:**

ఇంగ్లాండ్ సిరీస్ ఆడిన జట్టు నుంచి శ్రేయస్ అయ్యర్, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ తమ స్థానాలను ఫిక్స్ చేసుకున్నారు.

**జింబాబ్వేతో టి20 సిరీస్‌కి భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## భారత్ VS జింబాబ్వే టీ20 రికార్డ్స్.. అత్యధిక పరుగులు, వికెట్లు, సిక్సర్లు ఎవరివంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 (ട20×) సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ రేపు (గురువారం, జూలై 23న) హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరుగుతుంది. అదే మైదానంలో శనివారం (జూలై 25న) రెండవ టీ20, ఆదివారం (జూలై 26న) మూడవ టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ హోమ్ సిరీస్ కోసం జింబాబ్వే ఈరోజు (బుధవారం) తమ జట్టును ప్రకటించింది. స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజాను జట్టులో కొనసాగించింది. జింబాబ్వే తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రజా, బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించి సొంత ఫ్యాన్స్ ముందు భారత్‌ను ఓడించి సిరీస్ గెలవాలని చూస్తున్నాడు.

**తొలి విజయం కోసం శ్రేయస్ వెయిటింగ్:**

భారత టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవాలని శ్రేయస్ అయ్యర్ పట్టుదలతో ఉన్నాడు. అతను ఇప్పటి వరకు భారత్‌కు 8 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా, అందులో 7 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదురైంది. సెలెక్టర్లు ఈ పర్యటనకు బలమైన బ్యాటింగ్ రంగాన్ని ఎంపిక చేయగా, బౌలింగ్‌లో కొందరు ఇంకా అరంగేట్రం చేయని (అన్‌క్యాప్‌డ్) బౌలర్లు ఉన్నారు. భారత్ చివరిసారిగా ఫిబ్రవరి 2026లో జరిగిన టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో జింబాబ్వేతో ఆడింది. అంతకుముందు జూలై 2024లో జింబాబ్వేలో పర్యటించిన భారత్, శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన 5 టీ20ల సిరీస్‌లో 4 మ్యాచ్‌లను గెలుచుకుంది.

**భారత్ – జింబాబ్వే టి20 మ్యాచ్‌ల రికార్డులు:**

అత్యధిక విజయాలు: భారత్ – 14 మ్యాచ్‌ల్లో 11 విజయాలు.

అత్యధిక స్కోరు: భారత్ – 256/4 (20 ఓవర్లలో), చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో (ఫిబ్రవరి 26, 2026).

అత్యల్ప స్కోరు: జింబాబ్వే– 99/9 (20 ఓవర్లలో), హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో (జూన్ 20, 2016).

రన్స్ పరంగా పెద్ద విజయం: భారత్ 100 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 235) – హరారేలో (జూలై 7, 2024).

వికెట్ల పరంగా పెద్ద విజయం: భారత్ 10 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 153) – హరారేలో (జూలై 13, 2024).

పరుగుల పరంగా చిన్న విజయం: జింబాబ్వే 2 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 171) హరారేలో (జూన్ 18, 2016).

వికెట్ల పరంగా చిన్న విజయం: భారత్ 6 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 112) – హరారేలో (జూన్ 12, 2010).

**ఆటగాళ్ల రికార్డులు:**

అత్యధిక పరుగులు: సికందర్ రజా (జింబాబ్వే) –11 మ్యాచ్‌ల్లో 194 రన్స్.

అత్యధిక వ్యక్తిగత స్కోరు: అభిషేక్ శర్మ (భారత్) – 47 బంతుల్లో 100 పరుగులు, హరారేలో (జూలై 7, 2024).

అత్యుత్తమ సగటు (కనీసం 5 ఇన్నింగ్స్‌లు): శుభ్‌మన్ గిల్ (భారత్) – 42.50 (5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు).

అత్యుత్తమ స్ట్రైక్ రేట్ (కనీసం 50 బంతులు): అభిషేక్ శర్మ (భారత్) – 177.22 (6 మ్యాచ్‌ల్లో 179 పరుగులు).

అత్యధిక సెంచరీలు: అభిషేక్ శర్మ (భారత్) – 1.

అత్యధిక హాఫ్ సెంచరీలు: శుభ్‌మన్ గిల్ (భారత్) – 2.

అత్యధిక డకౌట్లు: మనీష్ పాండే (భారత్), వెస్లీ మాధెవెరె (జింబాబ్వే) – తలో 2 సార్లు.

అత్యధిక సిక్సర్లు: అభిషేక్ శర్మ (భారత్) – 6 మ్యాచ్‌ల్లో 13 సిక్సర్లు.

ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు: శుభ్‌మన్ గిల్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు.

అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ (భారత్), సికందర్ రజా, బ్లెస్సింగ్ ముజరబానీ (జింబాబ్వే) – తలో 8 వికెట్లు.

అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు: బరీందర్ శరణ్ (భారత్) – 4/10 (4 ఓవర్లలో), హరారేలో (జూన్ 20, 2016).

ఒకే సిరీస్‌లో అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 3 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు.

అత్యధిక డిస్మిసల్స్: సంజూ శాంసన్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 3 డిస్మిసల్స్ (3 క్యాచ్‌లు).

అత్యధిక క్యాచ్‌లు: రింకూ సింగ్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 6 క్యాచ్‌లు.

అత్యుత్తమ భాగస్వామ్యం: శుభ్‌మన్ గిల్ అండ్ యశస్వి జైస్వాల్ (భారత్) – మొదటి వికెట్‌కు 156 రన్స్ (జూలై 13, 2024).

అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 11 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 7 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక విజయాలు: శుభ్‌మన్ గిల్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.

## విప్లవ పథం: నక్సలైట్ పాత్రల్లో మెప్పించిన టాప్-5 కథానాయికలు

తెలుగు చిత్రసీమలో నాయిక ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తుపాకీ చేతబట్టి విప్లవ పోరాటాలు చేసే నక్సలైట్ పాత్రల్లో నటించి మెప్పించడం ప్రతి నటికి ఒక గొప్ప సవాలు. విప్లవ భావజాలాన్ని, భావోద్వేగాలను పండించి నక్సల్స్ పాత్రల్లో



**డియోర్ షూస్ మరియు హౌస్ ఆఫ్ CB డ్రెస్‌లో అదితి బుధతోకి అభిమానులను ఆశ్చర్యపరిచింది**



అలరించిన కథానాయికల వైపు దర్శకులు, ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తి చూపుతూనే ఉన్నారు. ఈ తరహా పాత్రల్లో మెప్పించిన మేటి నటిగా లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలో ఈ సీనియర్ నటి పోషించిన రాములమ్మ పాత్ర తెలుగు సినిమా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా అడవి బాట పట్టి నక్సలైట్‌గా మారిన పాత్రలో విజయశాంతి చూపించిన రౌద్రం.. పవర్‌ఫుల్ నటన ప్రేక్షకులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే సహజనటి జయసుధ కూడా గతంలో 'మహా సంగ్రామం' వంటి చిత్రాలలో నక్సలైట్ తరహా పాత్రను అత్యంత హుందాతనంతో భావోద్వేగాలను పండించి తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక ప్రస్తుత తరం హీరోయిన్లలో సాయి పల్లవి 'విరాటపర్వం' సినిమాలో 'వెన్నెల'గా నక్సలైట్ కథాంశంలో జీవించారు. కామ్రేడ్ రవన్న భావజాలానికి ఆకర్షితురాలై... ప్రేమ కోసం అడవి బాట పట్టిన అమాయకపు పల్లెటూరి అమ్మాయిగా సాయి పల్లవి కనబరిచిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే విడుదలైన 'మాఇంటి బంగారం' చిత్రంలో సమంత కూడా నక్సలైట్ నేపథ్య డైనమిక్ పాత్రలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. అలాగే రష్మిక మందన్న 'మైసా' చిత్రంలో కట్టుబొట్టు మార్చి రౌద్ర రూపంతో కూడిన విప్లవాత్మక పాత్రను పోషించడం ఈ ట్రెండ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.కేవలం అగ్ర కథానాయికలే కాకుండా.. టాలీవుడ్‌లో వచ్చిన పలు పరిమిత బడ్జెట్.. కంటెంట్ బేస్డ్ సినిమాల్లో కూడా నటీమణులు నక్సలైట్ పాత్రల్లో అద్భుతంగా రాణించారు. అప్పట్లో ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'ఎర్రసైన్యం', 'ఎన్‌కౌంటర్' వంటి చిత్రాల్లో విప్లవ నాయకిలుగా నటించిన నటీమణులు పల్లెటూరి ప్రజల ఆక్రందనలకు చలించి విప్లవ పోరాటాల బాట పట్టే ప్రజా యోధులుగా నటించారు. అటు బాలీవుడ్‌లో 'హజారోన్ ఖ్వాయిషేన్ ఐసీ' చిత్రంలో చిత్రంగద సింగ్... కోలీవుడ్‌లో ప్రకాష్ రాజ్ దర్శకత్వం వహించిన 'కంజీవరమ్' లో.. పలు తమిళ రాజకీయ–విప్లవ సినిమాల్లో సౌత్ కథానాయికలు నక్సల్స్ గానో.. తిరుగుబాటుదారుల పాత్రల్లోనో నటించి మెప్పించారు.ప్రజా యుద్ధనౌక, విప్లవ చిత్రాల పితామహుడు ఆర్. నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఎర్రసైన్యం చిత్రంలో యాంకర్ ఉదయభాను నక్సలైట్ గా అద్భుతంగా నటించి మెప్పించారు. ఆయన తెరకెక్కించిన చీమలదండు, దళం, ఒకే ఒక్కడు, లాల్ సలామ్ వంటి చిత్రాలలో నక్సలైట్లుగా .. విప్లవ పోరాట నాయికలుగా నటీమణులు అత్యంత సహజమైన అభినయంతో మెప్పించారు. రొటీన్ కమర్షియల్ హంగులకు దూరంగా... పచ్చటి అడవుల నేపథ్యంలో తుపాకీ చేతబట్టి... సమాజంలోని దౌర్జన్యాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే పాత్రల్లో కథానాయికలు కనిపించారు.



**షామా దక్షిణ ఫ్రాన్స్‌లో ఆకర్షణీయమైన జీవితాన్ని గడుపుతోంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com